క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాళేశ్వరం : విద్యుత్ సరఫరాలో 33 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా నేడు(శుక్రవారం) కాళేశ్వరం సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాలకు ఉదయం 7:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివే యనున్నట్లు మహాదేవ్‌పూర్ ఏఈ శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారు లు గమనించి సహకరించాలని కోరారు.

బాధిత కుటుంబాలకు బియ్యం అందజేత



కన్నాయిగూడెం : మండలంలోని ఐలాపూర్ గ్రామానికి చెందిన పోశెట్టి సమ్మక్క, మల్లెల మల్లక్కలు ఇటీవల అనారోగ్యంతో మృతిచెం దారు. బాధిత కుటుబాలను బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి రామ రాజు కార్యకర్తలతో కలిసి కుటుంబాలను గురు వారం పరామర్శించి, బియ్యం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు కోడె సుధాకర్, కుమ్మరి సత్యం, గద్దల హరిబాబు, వెంకటేష్, సాగర్, పైడక్క తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి యువకుడికి గాయాలు

కన్నాయిగూడెం : మండలంలోని కంతనపల్లి వద్ద బైక్ అదుపు తప్పి యువకుడు గాయప డిన సంఘటన గురువారం జరిగింది. మండ లంలోని సర్వాయి పంచాయతీ పరిధి భూప తిపురం గ్రామానికి చెందిన చర్ప సాయివర్ధన్.. మరో ఇద్దరు కలిసి పని నిమిత్తం ఏటూరు నాగారం మండలంలోని కొండాయికి వెళ్లారు. తిరిగి వస్తున్న క్రమంలో కన్నాయిగూడెం మం డలంలోని కంతనపల్లి పరిధిలోని పాలమకుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించ బోయి బైక్ అదుపు తప్పిపడిపోయింది. ఈ ప్రమాదంలో సాయివర్ధన్ ఎడమ కాలు విరిగిం ది. కాగా అటువైపుగా వెళ్తున్న గూర్రేవులకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు పూజారి కిశోర్ తన కారులో మండల కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో ఏటూరునాగారం ఆస్పత్రికి తరలించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



కన్నాయిగూడెం : మండలంలోని బుట్టాయి గూడెంలో లక్ష్మీదేవర ఆలయ నిర్మాణానికి కాం గ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జ్ జాడి రాంబాబు గురువారం రూ.5000ల విరాళం అందజే శారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాయకపోడులు ఆరాధ్య దేవతలుగా పూజించే దేవత లక్ష్మీదేవర అన్నారు. కార్యక్రమంలో జిల్లా సోషల్ మీడియా కో కన్వీనర్ సునార్కని సాంబశివరావు, జనగం వసంతరావు, కుమ్మరి వెంకట్, దుర్గం జనార్దన్, లక్ష్మీదేవర ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విత్తనోత్పత్తితో అధిక ఆదాయం

ఆడ, మగ వరిసాగుపై ఆసక్తి
- యాసంగిలో తగ్గిన దొడ్డు, సన్నాలు
- ప్రభుత్వానికి తగ్గిన బోనస్ భారం



ఆడ, మగ వరిపైరు (ఫైల్)

టేకుమట్ల : వానాకాలం, యాసంగిలో రైతులు వరి విత్తనోత్పత్తి రకాలను అధికంగా సాగు చేస్తున్నారు. ఈ యేడాది యాసంగిలో మండల వ్యాప్తంగా సుమారు 6,600 ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేయగా, అందులో దొడ్డు, సన్న రకాలు స్వల ్పంగా ఉన్నాయి. అధిక సంఖ్యలో రైతులు మేల్, ఫిమేల్ వరి సాగు చేసి అధిక లాభాలు ఆర్జిస్తు న్నారు. విత్తనోత్పత్తి పంటలైన మేల్, ఫిమేల్ వరి రకాలను పలు కంపెనీలు అందిస్తుండడంతో రైతు లు అధిక మద్దతు ధరతో పాటు, దిగుబడి వచ్చే వంగడాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఒక్కో కం పెనీకి చెందిన వరి రకం 7 నుంచి 12 క్వింటాళ్ల చొప్పున దిగుబడి వస్తోందిజ దీంతో పాటు రూ.5వేల నుంచి రూ.15వేల వరకు మద్దతు ధర పలుకుతోంది. లోకల్ వరి సాగుచేస్తున్న రైతులకు ఎకరాకు 30 క్వింటాళ్ల దిగుబడి రాగా, మద్దతు ధర రూ.2000ల నుంచి రూ.2,500లు పలుకుతుంది. దీంతో ఎక్కువ మంది రైతులు రెట్టింపు ఆదాయం వస్తున్న మేల్, ఫిమేల్ వరి పంటలను సాగు చేస్తున్నారు.

కంపెనీలకు,రైతులకు లాభాలు..

రైతులు పండించిన వరిని పలు కంపెనీలు విత్తన శుద్ధి చేసి అధిక ధరకు విత్తనాలను విక్రయిస్తు న్నారు. అలాగే రైతులకు సైతం మద్దతు ధర చెల్లిం చడంతో విత్తనోత్పత్తికి చెందిన కంపెనీలు, అన్న దాతలు అధిక లాభాలు పొందుతున్నారు. సన్న రకం వరికి ఎక్కువగా తెగుళ్లు సోకడంతో రైతులు ఎక్కువగా పెట్టుబడి పెట్టాల్సి రావడంతో దొడ్డు రకాలను పండిస్తున్నారు.

మద్దతు ధర.. అధిక దిగుబడి

రైతులు సన్న రకాలను పండించేందుకు ప్రోత్సాహ కంగా క్వింటాకి రూ.500ల చొప్పున బోనస్ ప్రక టించడంతో వానాకాలంలో చాలా మంది రైతులు సన్న రకాలను పండించారు. కానీ తెగుళ్ల బెడదతో యాసంగిలో మళ్లీ మేల్, ఫిమేల్ వరి వంగడాలను పండించారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర రావాలని ఆశపడే రైతులకు మేల్, ఫిమేల్ వరి వరంగా మారాయి. దీంతో రబీలో మేల్, ఫిమేల్ వరి సాగుకు రైతులు ముందుకు వస్తున్నారు.

ఆరేళ్లుగా సాగు చేస్తున్నా..



నాకున్న ఐదెకరాల్లో ఆరేళ్లుగా మేల్, ఫిమేల్ వరిని సాగు చేస్తున్నా. వాతావరణం అను కూలిస్తే దిగుబడి వస్తుంది. ఇప్పటి వరకు బాగానే లాభాలు వచ్చాయి. వాతావరణం ప్రతికూలిస్తే కొంత మేర నష్టం తప్పదు. దొడ్డు, సన్న రకాల కంటే ఎక్కువ రాబడి సాధించా.

\- సల్పాల కుమార్, రామకిష్టాపూర్(టి)

మద్దతు ధర ఉంటుంది



ఐదేళ్లుగా మేల్, ఫిమేల్ వరి సాగుచేస్తున్నా. లోకల్ వరి సాగుకంటే దీంతో లాభాలు వస్తున్నాయి. గతం లో దొడ్డు, సన్న రకాలను వానాకాలం, యాసంగిలో పండించే వాడిని. ప్రస్తుతం రబీలో తప్పనిసరిగా మేల్, ఫిమేల్ వరి పంటను సాగు చేస్తున్నా. వరి క్విం టాకి రూ.14వేలు చెల్లిస్తున్నారు. ఎకరాన 8 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది.

\- సరికొమ్ముల రవీందర్, టేకుమట్ల

‘గ్రామ పంచాయతీ లైసెన్స్ తప్పనిసరి’



దుకాణదారులతో మాట్లాడుతున్న అధికారులు

కాళేశ్వరం : సరస్వతి పుష్కరాల వేళ కాళేశ్వరానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు కాళేశ్వరంలో కొత్తగా ఏర్పాటు చేయ బోయే దుకాణాలతో పాటు ప్రస్తుతం నిర్వహిస్తున్న దుకాణాలకు గ్రామ పంచాయతీ అనుమతి, లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్, వైద్యాధికారి డాక్టర్ సుస్మిత, ఎస్సై తమాషారెడ్డి సూచించారు. గురు వారం కాళేశ్వరంలో రోడ్ల వెంట ఏర్పాటు చేసిన దుకాణాలను అధికారులు పరిశీలించారు. ఈ సంద ర్భంగా చాలా మంది దుకాణాదారులు రోడ్లను ఆక్ర మించి వేసిన పందిళ్లు, ఇతర సామాన్లు రోడ్లపై వేసి వాహనదారులకు, పాదాచారులకు ఇబ్బంది కలిగిస్తున్న ఘటనలను పరిశీలించారు. అనంతరం అధికారులు దుకాణాదారులతో సమావేశం నిర్వ హించి దుకాణాల నుంచి వచ్చే వ్యర్థాలను రోడ్లపై విచ్చలవిడిగా వేయకుండా ప్రతి దుకాణంలో చెత్త డబ్బాను ఏర్పాటు చేసుకోవాలని, ప్లాస్టిక్, పాలిథిన్ సంచుల అమ్మకం, వాడకంపై నిషేధం అమలులో ఉన్నందున ఎవరైనా అమ్మినా, వాడినా పం చాయతీ రాజ్ చట్టం మేరకు జరిమానా విధించడం జరుగుతుందని హెచ్చరించారు. అలాగే హోటళ్ల లోని ఆహార పదార్థాలు, రూం రేట్లు నియంత్రణ కోసం దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు విజిలెన్స్ టీం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు, ప్రతినిధులు, వ్యాపారస్తులు, అధికారు లకు సహకరించి పుష్కరాలను విజయవంతం చేయాలని కోరారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత



సెల్‌ఫోన్లు అందజేస్తున్న ఎస్సై, ట్రెయినీ ఎస్సై

చిట్యాల : మండల కేంద్రానికి చెందిన అవినాష్, గుండా తిరుపతి, భూపాలపల్లికి చెందిన మేడిపల్లి కుమార్, నేరేడుపల్లి గ్రామానికి చెందిన తుపాకుల రాజేందర్ సెల్‌ఫోన్లను పోగొట్టుకున్నారు. వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐ ఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి సెల్‌ఫోన్‌లను రికవరీ చేసి గురువారం అందించామని ఎస్సై శ్రావన్‌కుమా ర్, ట్రెయినీ ఎస్సై హేమ తెలిపారు. సహాయపడిన కానిస్టేబుల్ లాల్‌సింగ్‌ను ఎస్సై అభినందించారు. ఎస్సై మాట్లాడుతూ.. ఎండాకాలం సెలవుల నేప థ్యంలో పిల్లలకి సెల్ ఫోన్లు ఇవ్వకూడదని సూచిం చారు. అలాగే ఈతకు వెళ్లకుండా చూడాలని, ఆన్ లైన్ బెట్టింగులకు దూరంగా ఉండాలని కోరారు. ఒకవేళ ఎవరైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కు కాల్ చేయాలని సూచించారు.

పరిహారం చెల్లిస్తేనే భూములిస్తాం..

- అధికారులకు తేల్చిచెప్పిన రైతులు

మొగుళ్లపల్లి : మండల కేంద్ర శివారులో రైతులకు చెందిన వ్యవసాయ భూముల మీదుగా వెళ్తున్న నేషనల్ హైవే రోడ్డు నిర్మాణ పనులకు పూర్తి పరిహారం చెల్లిస్తేనే భూములిస్తామని బాధిత రైతు లు, భూములకు హద్దులు వేయడానికి వచ్చిన సం బంధిత అధికారులకు తేల్చి చెప్పారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ.. మండల కేంద్రంలో జాతీయ రహదారి పనులకు హద్దులు ఏర్పాటు చేసేందుకు వచ్చిన అధికారులను రైతులు నిల దీశారు. నేషనల్ హైవే రోడ్డు పనులకు తాము వ్యతిరేకం కాదని, భూములు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ నష్టపరిహారం ఇవ్వడంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తోందని చెప్పారు. కొందరికి రూ.23లక్షలు చొప్పున మాత్రమే నష్టపరిహారం చెల్లించి హద్దులు వేయడానికి ఏలా వస్తారని ప్రశ్నిం చారు. 90శాతం మంది రైతులకు ఇప్పటి వరకు ఎలాంటి నష్టపరిహారం అందలేదని వివరించారు. ఎకరాకు రూ.40లక్షల పరిహారం ఇవ్వాలని అధికారులకు తెలిపారు. అలాగే అధికారులు, రైతు లను విభజించే కుట్రను మానుకోవాలని అన్నారు. కాగా నేషనల్ హైవే సర్వేకు రైతులంతా ఒప్పుకు న్నట్లు తప్పుడు సమాచారం ఇవ్వొద్దని సూచిం చారు. బాధిత రైతులు మోరే రవీందర్‌రెడ్డి, అడ్డూరి రాజేందర్, అరికాంతపు కృష్టారెడ్డి, గుండా భిక్షపతి, కొల్లూరు స్వప్న, గుర్రపు సునందరెడ్డి, మోరే పద్మ, బొయిన కుమార్, బండారి శ్రీనివాస్, కొమురయ్య, మౌనిక, మోరే అనూషతో పాటు తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ అక్రమ దందాను అరికట్టాలి



మాట్లాడుతున్న నాయకులు

వెంకటాపురం(కె) : మండ లంలో అక్రమంగా నిర్వ హిస్తున్న గ్రావెల్ దం దాను అరికట్టాలని గోం డ్వానా సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని ఎదిర గ్రామం లో గోండ్వానా సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజె న్సీ చట్టాలకు విరుద్ధంగా ఇసుక క్వారీలకు అక్రమం గా గ్రావెల్ తరలిస్తున్నారని అన్నారు. గిరిజన చట్టాలను నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూముల నుంచి అక్రమ గ్రావె ల్‌ను తరలిస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని వివరించారు. మండల రెవెన్యూ అధికారు లు, అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలుకుతూ ఆదివాసీ చట్టాలకు తూట్లు పొడుస్తున్నా రని దుయ్యబట్టారు. అక్రమ గ్రావెల్ దందాను అరికట్టక పోతే ఆందోళన చేపడతామని హెచ్చరిం చారు. నాయకులు చంటి, కృష్ణ, సురేష్, పవన్, ప్రకాశ్, అనిల్ తదితరులు ఉన్నారు.

నియామకం



విష్ణుయాదవ్, కొత్తపల్లి(గోరి)



వెంకటేశ్ గౌడ్, చిట్యాల



నాంసాని రమేశ్, టేకుమట్ల

భూపాలపల్లి రూరల్ / రేగొండ / చిట్యాల / టేకుమట్ల : జిల్లాలోని నాలుగు మండలాల అధ్యక్షు లను, కౌన్సిల్ మెంబర్లను నియమించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశిధర్‌రెడ్డి గురు వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భూపాలపల్లి మండల అధ్యక్షుడిగా పులుగుజ్జు రాజు, కౌన్సిల్ మెంబర్‌గా శివనాత్రి వేణు, చిట్యాల మండలానికి బుర్రా వెంకటేశ్ గౌడ్, ఉడుత వనక్క, కొత్తపల్లి(గోరి)మండలానికి సూదనబోయిన విష్ణు యాదవ్, మచ్చపాక సతీష్, టేకుమట్ల మండల అధ్యక్షుడిగా గుర్రపు నాగరాజు, కౌన్సిల్ మెంబర్‌గా నాంసాని రమేశ్‌ను నియమించినట్లు నిశిధర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కొత్తపల్లిగోరి బీజేపీ మండల అధ్య క్షుడు విష్ణు యాదవ్ మాట్లాడుతూ.. పార్టీ బలోపే తానికి ఎల్లవేళలా కృషి చేస్తానని, తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీ సభ్యులు

టేకుమట్ల : మండల సమాఖ్య నూతన కమిటీని గురువారం డీపీఎం-ఐబీ సోమయ్య ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏపీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ మండల కేంద్రంలోని ధనలక్ష్మి మం డల సమాఖ్య పరిధిలో 26 గ్రామైక్య సంఘాలతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని వెల్లడించారు. మండల అధ్యక్షురాలిగా గువ్వాడి రజిత (ఆరెపల్లి), కార్యదర్శిగా బండి శ్రీజ (వెలిశాల), కోశాధికారిగా అబ్బెంగుల రాణీ (అంకుషాపూర్)లను ఏకగ్రీవం గా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఏపీఎం రవివర్మ, సీసీలు రాజేందర్, మంజుల, స్వాతి, మమత, భాగ్యశ్రీ, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేయొద్దు

- పీస్ కమిటీ సమావేశంలో ఏసీపీ సతీష్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ సతీష్‌బాబు

పరకాల: భారత్, పాకిస్తాన్ మధ్య జరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఎటువంటి గొడవలకు తావిచ్చే మెసేజ్‌లను సోషల్ మీడియాలో పోస్టు చేయొద్దని పరకాల ఏసీపీ సతీష్‌బాబు హెచ్చరిం చారు. సీపీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు పరకాల పోలీస్‌స్టేషన్‌లో గురువారం పీస్ కమిటీ సమావేశా న్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లా డుతూ ప్రతిఒక్కరు కుల, మతాలకు అతీతంగా సోదరభావంతో దేశ సమగ్రతకు పాటుపడాల న్నారు. శాంతియుత వాతావరణం కోసం కృషి చేయాలని, సోషల్ మీడియాలో కించపర్చే పోస్టు లు, తప్పుడు ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు తీసు కుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ క్రాంతి కుమార్, ఎస్సై శివకృష్ణ, విశ్వహిందూ పరిషత్, ముస్లిం మత పెద్దలు, భజరంగ్ దళ్ కార్యకర్తలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి : ఆరుగాలం కష్టపడి పండించిన పం టను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రా ల్లోనే విక్రయించాలని, దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణరావు సూచించారు. ఈ సందర్భంగా గురువారం మండలంలోని పర్లపల్లి గ్రామంలో ఐకేపీ (జీవన జ్యోతి గ్రామ సంఘం) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు మద్దతు ధర పొందాలంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకే ధాన్యం తీసుకుపోవాలని సూచించారు. రైతుల సం క్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి అహర్నిశలు కష్టపడి పని చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో తహ సీల్దార్ సునీత, ఎంపీడీఓ సుభాష్‌చంద్రబోస్, చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎండీ రఫీ, డీఆర్డీఏ జిల్లా అధికారి సోమయ్య, ఏపీ ఎం రవివర్మ, సీసీలు బత్తిని ప్రవీన్, శ్రీనివాస్, బాబురావు, మండల నాయకులు, రైతులు తదిత రులు పాల్గొన్నారు.

డీలర్లు నిబంధనలు పాటించాలి

- ఏటూరునాగారం ఏడీఏ అవినాష్ వర్మ



అవగాహన కల్పిస్తున్న ఏడీఏ అవినాష్ వర్మ

వాజేడు : వానాకాలం సీజన్‌లో ఎరువులు, విత్త నాలు, పురుగు మందుల డీలర్లు తప్పని సరిగా నియమ, నిబంధనలను పాటించాలని ఏటూరు నాగారం సహాయ వ్యవసాయ సంచాలకులు అవినాష్ వర్మ అన్నారు. మండల పరిధిలోని రైతు వేదికలో గురువారం మండల స్థాయిలోని డీలర్లకు ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలను విక్రయించే సమయం లో చేపట్టాల్సిన అంశాలను వివరించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా నిబంధనల ప్రకారం విక్రయా లు చేయాలన్నారు. మండల వ్యవసాయాధికారి ముంజ మహేష్, ఏఈఓ హరీష్, ఉన్నారు.

కన్నాయిగూడెం : రైతులకు నకిలీ విత్తనాలు అం టగడితే కఠిన చర్యలు తప్పని ఏటూరునాగారం ఏడీఏ అవినాష్ వర్మ అన్నారు. మండల కేంద్రం లోని రైతు వేదికలో గురువారం మండల వ్యవ సాయ అధికారి మహేష్ అధ్యక్షతన ఫర్టిలైజర్ యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. నిబంధనలు అతిక్రమించి వ్యాపారాలు చేస్తే చర్య లు తీసుకోవడం జరుగుతుందన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మినట్లు తేలితే షాపు లైసెన్స్ పత్రాలు రద్దు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి కల్యాణి, డీలర్లు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు

చిట్యాల : మండలంలోని మానేరు, చలివాగుల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై శ్రావన్‌కుమార్ హెచ్చరించారు. ఈ సందర్భంగా గురువారం అందుకుతండాకు చెం దిన కాసాని రవి ఎలాంటి అనుమతి లేకుండా ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పట్టుకుని అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మండలంలో అనుమతి పత్రాలు లేకుం డా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ఇసుక సొసైటీల ఎంపికకు గ్రామసభ

మంగపేట : మండలంలోని రమణక్కపేట పం చాయతీ పరిధిలోని గిరిజన ఇసుక లేబర్ సొసైటీ లను పెసా నిబంధనల ప్రకారంగా ఎంపిక చేసేం దుకు ఈనెల 12న గ్రామసభలును నిర్వహించను న్నట్లు ఎంపీడీఓ బానోత్ భద్రు గురు వారం ఒక ప్రకటనలో తెలిపారు. రమణక్క పేట గ్రామపం చాయతీ పరిధిలోని రమణక్కపేట 2, గొల్లగూడెం ఇసుక క్వారీ నిర్వాహణపై మెజార్టీ సొసైటీని ఎం పిక చేసేందుకు ఉదయం 9గంటలకు గ్రామసభలు నిర్వహిం చనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సొసై టీల ఎంపికకు రెండ్రోజులు ముందుగానే ఆయా గ్రామాల్లో టాంటాం ప్రచారం చేసి పెసా గ్రామసభ లను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని గ్రామ పంచాయతీ అధికారులను ఆయన ఆదేశించారు.

ఆటల్లో ఆరితేరేలా!

- హ్యాండ్ బాల్.. హ్యాండ్ రేజింగ్
- సమ్మర్ క్యాంపుల్లో క్రీడాకారులకు శిక్షణ



హ్యాండ్‌బాల్ ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు

ఏటూరునాగారం : క్రీడాకారులు ఆటల్లో నైపుణ్యా న్ని ప్రదర్శించి సత్తా చాటుతున్నారు. హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభను చాటి హ్యాండ్ రేజింగ్ గేమ్స్ ఆడుతున్నారు. దీంతో క్రీడాకారులు అడుగు పెట్టిన క్రీడా మైదానంలో ప్రతిభ చూపి అవార్డు గ్రహీతలుగా ఎదుగుతున్నారు. ఏటూరునాగారం మండలంలోని స్పోర్ట్స్ క్లబ్ కోచ్ పర్వతాల కుమార స్వామి ఆధ్వర్యంలో హ్యాండ్ బాల్‌లో శిక్షణ ఇస్తు న్నారు. జిల్లా పరిషత్ పాఠశాల క్రీడామైదానంలో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రతి రోజు శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. దీంతో మండల కేంద్రానికి చెందిన పలువురు క్రీడాకారులు హ్యాండ్‌బాల్ పోటీ ల్లో రాణిస్తున్నారు.

క్రీడల్లో ప్రతిభావంతులు

మండల కేంద్రానికి చెందిన మంచర్ల మన్విత హ్యాం డ్‌బాల్ క్రీడాకారిణి. మూడేళ్ల నుంచి గ్రౌండ్ ప్రాక్టీస్ చేస్తూ రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్-14 సబ్ జూనియర్ కేటగిరిల్లో మొదటి బహుమతి గెలుచు కుంది. రాజేష్, ఇమ్రాన్, హరిప్రియ రెండు సార్లు రాష్ట్రస్థాయి క్రీడల్లో గెలుపొంది మెడల్స్ అందుకున్నారు.

ప్రత్యేక సమ్మర్ క్యాంప్

స్పోర్ట్స్ అథారిటి ఆఫ్ తెలంగాణ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ములుగు ఆధ్వర్యంలో ప్రతి ఏటా క్రీడాకారు లకు, విద్యార్థులకు సమ్మర్ క్యాంపును ఏటూరు నాగారం జెడ్పీఎస్ఎస్‌లో ఏర్పాటు చేస్తున్నారు. నాలుగేళ్లుగా క్రీడా ప్రాంగణంలో హ్యాండ్‌బాల్ కోచ్‌గా కుమారస్వామి క్రీడాకారులను విజేతలుగా తీర్చిదిద్దుతున్నాడు. ఆటలతో పాటు చదువులో కూడా రాణించే విధంగా ఉపాధ్యాయులు మెళకువ లు, క్రీడాస్ఫూర్తిని నింపుతున్నారు. అలాగే ఐదేళ్ల నుంచి ఇప్పటి వరకు 100కు పైగా రాష్ట్రస్థాయిల్లో, 10 జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని అనేక మంది క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తురు.

క్రీడాకారులపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థులను ఉత్తమ క్రీడాకారు లుగా తయారు చేసి ప్రతిభ కన బర్చే విధంగా ప్రత్యేక శ్రద్ధ పెడు తున్నాం. ప్రభుత్వం సమ్మర్ క్యాంప్ చేపట్టడం మరింత దోహ దపడుతుంది. ఇదే కాకుండా ప్రతిరోజు హ్యాండ్ బాల్‌లో కోచింగ్ ఇవ్వడం వల్ల క్రీడాకారులు జాతీయ, రాష్ట్ర స్థాయిలో రాణిస్తున్నారు. జిల్లా క్రీడల అధికారి క్రీడాకారులకు ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు.

\- పి.కుమారస్వామి, కోచ్, ఏటూరునాగారం

హ్యాండ్‌బాల్‌లో రాణిస్తున్నా..



క్రీడలు నేర్చుకోవడంతో మానసికోల్లాసం కలుగుతుంది. కోచ్ సమగ్రమైన శిక్షణ ఇవ్వడం వల్ల హ్యాండ్ బాల్ క్రీడలో రాణిస్తున్నా. జాతీయ స్థాయిలో అవార్డు దక్కించుకున్నా. మరిన్ని అ వా ర్డులుసాధించేందుకు నిరంతరం కృషి చేస్తా.

\- మంచర్ల మన్విత, క్రీడాకారిణి

నాలుగేళ్ల నుంచి ప్రాక్టీస్



హ్యాండ్ బాల్ నేర్చుకోవాలనే పట్టుదలతో నాలుగేళ్ల నుంచి నేర్చుకుంటున్నా. ఇప్పటి వరకు రెండు రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొందా. ప్రతి రోజు క్రీడామైదానంలో ప్రాక్టీస్ చేస్తూ సమ్మర్ క్యాంప్‌లో కూడా హాజరవుతున్నా. క్రమశిక్షణతో ఆటలు నేర్చుకుంటున్నా.

\- రాజేష్, క్రీడాకారుడు